# మబ్బుతెరలు

మాధవి చంటాడికి కళ్ళనిండా కాటుకపెట్టి ముద్దులు కురిపించి మురిసిపోతోంది. ఆ చిన్నారి బాబుమీద వందేళ్ళ భవిష్యత్తు ఊహిస్తోంది. పాకే బాబుని నడిపించి బడికిపంపి, ఆటలకై ఓ చెల్లాయిని తోడిచ్చి..... యింకా యింకా ఆ కుఱ్ఱాడినే పెద్దచేసి పెళ్ళిచేసి, ఆ చంటాడి భవిష్యత్తుపై ఎన్నెన్నో ఊహల్ని పేర్చి ఆలోచిస్తూ లోలోనే నవ్వేస్తూ, మాటిమాటికీ చంటాడిని ముద్దెడ్తూ, పాలబుగ్గ ఎఱ్ఱబడితే 'అమ్మో' అని హృదయానికి హత్తుకుంది.

మధ్యాహ్నం నిద్రమత్తు పూర్తిగా వదిలేలా దొడ్లో బావి దగ్గర ముఖం కడిగి తుడుచుకుంటూ యింట్లో ప్రవేశించిన కాంతారావు మాధవిని చూసి గుమ్మందగ్గరే ఆగిపోయి చప్పుడు చేయకుండా వెళ్ళి ఆమె ప్రక్కనే కూర్చున్నాడు.

ఆమె గతుక్కుమంది. జారిపోయిన పవిటను సరిచేసుకుని, పాలుపడదామను కొంటున్న ఒడిలో చంటాడిని భుజాలమీదకు తీసుకుంది.

"కుఱ్ఱాడిని చూసి అలా నీలో నువ్వే నవ్వుకోకపోతే కాస్తా నాక్కూడా చెప్పకూడదా?" అన్నాడు కాంతారావు.

మాధవికి సిగ్గేసి తలదించుకుంది. చూపుడువేలితో చుబుకాన్ని పైకెత్తి "మన

చిన్నాడిని కలెక్టరు చేస్తున్నావా, డాక్టరు చేస్తున్నావా?" అన్నాడు, ఆమె ముఖంలో ముఖంపెట్టి మెల్లగా నవ్వుతూ.

నవ్వి ఊరుకుంది మాధవి. "మీలా లాయరు మాత్రం కాడులే" అని అందామనుకుంది. ఆ మాట నాలిక చివరి వరకూ వచ్చిందిగాని బైటపడలేదు.

వారిని చూస్తుంటే తనకేదో భయం. వారి ఎదురుగా ఒక్కమాటకూడా చెప్పలేదు తను. పెళ్ళయి సంవత్సరం పైబడినా అంత చనువుతో వారి ముందెప్పుడూ ప్రవర్తించలేదు. ఏమిటో! వారుమాత్రం ఎప్పుడూ ప్రేమతో ఆప్యాయంగా తనను దగ్గరకు తీసుకుని కవ్వించి నవ్విస్తారు. అయినా వారంటే భయమూ; బిడియమూ తనను వొదిలిపెట్టడంలేదు.

"అదిగో అప్పుడే మళ్ళీ ఏదో లోకంలోకి వెళ్ళిపోయావ్. ఇలా అయితే నీతో వేగడం కష్టం సుమా"

"బావగారు వేగలేకపోతే మరికొంచెం నూనె పోసుకోండి" తూనీగలాగ వచ్చి తుర్రుమంది మరదలుపిల్ల మాలతి.

"గట్టిగా మాట్లాడకండి, బాబు నిద్రపోతున్నాడు" అంది మాధవి.

"ఇంతకీ ఏం పేరు పెట్టాలనుకుంటున్నావ్ మీ బాబుకి?" కాంతారావు మాధవి కళ్ళల్లోకి కళ్ళుపెట్టి అడిగాడు.

"మహా మీ బాబు కానట్టు" అంది మాధవి ఆ వెంటనే. కాని అతనన్న మాటలు జ్ఞాపకం రాగానే కొద్దిగా కంపించిపోయినట్టు అయిపోయింది. అది కనబడకుండా సన్నగా నవ్వి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

మరదలు పిల్ల మళ్ళీవచ్చి "ఏం బావా, బాబుకి ఏం పేరు పెడ్తున్నావ్?" అంది.

"చెప్పనా... చెప్పనా" అంటూ ముందుకొచ్చాడు. "చెప్పకపోతే దాచుకో, ఎవరిక్కావాలి" అంది బుంగమూతిపెట్టి.

"ఓ యబ్బో! అందుకే కాబోలు అంత ఆతృత తెలుసుకోవాలని"

"చెప్పుబావా ఏంపేరు పెడ్తావో" స్థాయి తగ్గించి ఒక మెట్టు దిగి అంది.

ఇకబెట్టు చేస్తే లాభంలేదనుకున్నాడు.

"చెప్పనా"

"ఊ"

"కృష్ణమోహన్"

"కృష్ణమోహన్... కృష్ణమోహన్" అనుకుంటూ దొడ్లోకి పరుగెత్తింది మాలతి.

గదిలో తువ్వాలు ఆరేస్తున్న మాధవి ఆమాటలు వినడంతోనే భర్తవేపు ఓమారు చూసి అతను నవ్వుతూ ప్రేమతో చిలిపిగా దగ్గరకు రమ్మని సైగచేస్తున్నా వెళ్ళకుండా పరధ్యాన్నంగా వరండాలోకి వెళ్ళిపోయింది.

ఆరాత్రి భోజనం చేశాక మాధవి అతని పక్కనే కూర్చుని తాంబూలం చుట్టియిస్తూ "ఆ పేరే పెడ్తారా బాబుకి?" అంది.

"ఊ" అన్నట్టుగా తలూపాడు.

"నిజంగానా?" సూటిగా అతని ముఖంలోకే చూస్తూ అడిగింది.

"ఏం ... ఆ పేరే పెడదామనుకుంటున్నాను, బావుంది కదూ. మన రామం. నేనూ కలిసి నువ్వు వుత్తరం రాసినరోజు సాయంకాలం నాన్నగారితో ఆలోచించి యీపేరు నిర్ణయించాం" అన్నాడు. అని, ముందుకు వంగి నోరు తెరిచాడు ఆమె సున్నం రాసిన ఆకుని నోటికందిస్తుందని.

ఆమె గబుక్కున లేచిపోయి కిటికీ ముందుకు వెళ్ళి నుంచుంది కిటికీలోంచి బైటకిచూస్తూ.

అలా లేచిపోయినందుకు ఆశ్చర్యపోయినా పరిహాసం చేస్తున్నదేమోనని రెండుసార్లు "ఇలా రా మాధవీ" అంటూ మృదువుగా పిలిచాడు.

ఎప్పుడయినా మాధవి యింట్లో ఎక్కడున్నా, ఏం చేస్తున్నా కాంతారావు అలా స్వరం తగ్గించి లాలనగా పిలిస్తే చప్పున అతనిముందుకొచ్చి ఏం పనన్నట్టు అతని ముఖంలోకి చూసేది. అదే మృదుత్వం అతని మాటల్లో ధ్వనించినా ఆమె దగ్గరకు రాకపోవడానికి కారణమేమిటో తెలీక తనే వచ్చి ఆమె పక్కనే నుంచొని రెండు చేతుల్తోనూ ఆమె భుజాల్ని పట్టి తనవైపుకు తిప్పుకున్నాడు.

అప్పుడే జారిపోయిన రెండు కన్నీటిబొట్లకు సూచనగా తడిచారలు ఆమె బుగ్గలమీద కనిపించాయి. "ఏమిటిది మాధవీ!" అని అతను యింకా పూర్తిగా అనకుండానే కంగారుగా పైట కొంగుతో కన్నీటి చారల్ని తుడుచుకొని "ఏం లేదండీ" అంది.

కాంతారావు కేమిటో అర్థంకాక తిరిగివచ్చి మంచంమీద కూర్చున్నాడు.

పెళ్ళయిన మొదటి రోజుల్లో అలాగే ఆమె చాటుగా అతనికి తెలీకుండా కళ్ళనీళ్ళు పెట్టుకుని, పొరపాటున అతని కళ్ళముందు పడినప్పుడు తప్పించుకుందామని సన్నగా నవ్వేది. ఆ నవ్వులో, ఆమె చీర సింగారించి, జడలో జాజిమొగ్గలు తురిమి రంగరించిన బంగారు బొమ్మలా ఎదురుగా నిలబడి,అతనన్న ఏ మాటకో సిగ్గుదొంతర్ల తెరల మధ్య సన్నగా నవ్విన ఛాయలు కనిపించేవికావు.

"ఏం అలా వున్నావని అతను అడగనూ లేదు, ఆమె చెప్పనూలేదు. తల్లిదండ్రుల్ని వదిలి వుండలేని కొత్తపెళ్ళికూతురి తొలిరోజులు కదా అనుకున్నాడు. తర్వాత తర్వాత అతను ఎప్పుడూ ఆమె కళ్ళవెంట కన్నీరు కారుతుండగా చూడలేదు. ఈవాడు మళ్ళీ అలాగే ఆరోజుల్లో వలె ఏమీ కారణంలేకుండానే ఆమె కన్నీరు కారుస్తుండడంలో విశేషమేమిటో అతనికి అర్థం కాలేదు.

మంచంమీద కూర్చున్నవాడు మళ్ళీ ఆమె పక్కకువచ్చి"ఏం.. పేరు బాగోలేదా?" అన్నాడు.

మాధవి మాట్లాడలేదు. కిందకు చూస్తూ కాలిగోటితో గచ్చుమీద గీస్తూ తల అడ్డంగా తిప్పింది.

"మరేం, ఆ మాట చెప్పడంతోనే అదోలా అయిపోయావ్?"

"ఏం లేదు, ఊరికే, ఏదో జ్ఞాపకం వచ్చింది.. అయ్యో మర్చిపోయాను, ఆకుల్లో సున్నం లేదండీ" అంటూ చేతిలో సున్నంరాసిన ఆకు అతనికి యివ్వబోయింది.

"ఒద్దులే, నేను రాసుకున్నాను" అన్నాడు నవ్వుతూ.

ఉయ్యాల్లో చంటాడు కదులుతూవుంటే వెళ్ళితీసుకొచ్చి అతనికి చాటుగా పాలుపెడ్తూ"మీరు చాలా మంచివారండీ" అంది. నిష్కల్మంషంగా అన్న ఆ మాటలు ఎందుకందో తెలీకపోయినా నిండుగా చిరునవ్వు నవ్వాడు అతను.

పొద్దున్న లేచేటప్పటికి వెచ్చగా సూర్యకిరణాలు కిటికీలోంచి మీద వాలుతున్నాయి. అంతకుముందే మాధవి ఓమారు వచ్చి లేపి వెళ్ళిపోయింది. ఇక అప్పటికైనా లేవకపోతే బాగోదని బలవంతంగా లేచి ముఖం కడుక్కుందామని బావివైపు వెళ్ళాడు.

"ఏం బావా! కుంభకర్ణుడి నిద్రచేశావు. నీ కంటే బాబే నయంసుమా. నాలుగింటికే లేచి అక్కకు పనిచెప్పాడు" అంది.

"మా బాబు నాలుగాకులు ఎక్కువే చదువుకుంటాడు లేవే. ఇవాళ నాచేత పనిచేయించుకున్నవాడు మరో రెండు రోజులుపోతే నీకూ పనిచెప్తాడు" అంది మాధవి టూత్‌పేస్టు,బ్రష్షూబావిదగ్గరపెట్టి చెల్లెలన్న మాటకు జవాబుగా.

"ఎలా అయినా పేరు సార్థకం చేసుకుంటాడులే. కృష్ణమోహన్‌లో ఆ బాలకృష్ణుడి చిన్నెలన్నీ యిప్పటినుంచే వున్నాయి సుమా" అంది మాలతి మూతి మూడు వంకర్లు తిప్పి.

మాధవి ముఖం ముడుచుకుంది. ఇంకా చెల్లెలితో ఏదో అందామని, దాన్ని ఏడిపిద్దామని అనుకున్న మాధవి ఆమాట వినడంతోనే మరేమీ అనకుండానే యింట్లోకి వెళ్ళిపోయింది.

మాధవి అలా వెళ్ళిపోవడం కాంతారావుకు, మాలతికి అర్థంకాలేదు. ఆశ్చర్యంతో ఆమె వెళ్తున్నవైపే చూస్తూ వుండిపోయారు. ఆమె వంటగదిలో పొయ్యిముందు కూర్చుని కాఫీకాస్తున్నప్పుడు పైటచెంగుతో కళ్ళు వత్తుకోవడం ఒక్క కాంతారావే ముఖం కడుక్కుంటూ బావి పక్కనే వున్న వంటగది కిటికీలోంచి చూశాడు.

స్నానం చేశాక గదిలో కూర్చొని పేపరు చదువుతూ వుండగా మాధవి కాఫీ తెచ్చియిచ్చింది. కప్పు అందుకుంటూ "కళ్ళు అలా వున్నాయేం?" అన్నాడు.

"ఎలా వున్నాయ్?" అంది అదోలా నవ్వుతూ. ఆ తర్వాత అద్దంముందు కెళ్ళి నుంచొని కళ్ళు ఎర్రగా వుండడం చూసి "ఏం లేదు. పొయ్యిదగ్గర కంట్లో ఉదో నలుసు పడిందంతే" అంది.

ఆ మాటలు అతను ఆలకించినట్టులేదు. అతనికోసం మావగారు వస్తే గబగబా కాఫీ పూర్తిచేసి ఆయనతో కలిసి బైటికి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం యింటికి వచ్చాక భోజనం దగ్గర "ఎక్కడకు వెళ్ళారండీ నాన్నగారూ మీరూ" అంటూ అడిగింది మాధవి.

"అబ్బాయిని తీసుకుని అలా అవధానులుగారింటికి వెళ్ళానమ్మా, మన చంటాడి పేరు గురించి అబ్బాయి చెప్పాడు. అది బాగానే వుందట.... నక్షత్రం అదీ సరిపోయిందన్నారు" అన్నాడు తండ్రి అల్లుడికి బదులు తనే జవాబు చెప్పేస్తూ.

"అలాగా" అంది మాధవి. ఆ సమయంలో పప్పులో నెయ్యి వేస్తున్న ఆమె చేతులు వణికాయి.

"అదేమిటి! అంత నెయ్యి వేస్తున్నావ్?" అన్నాడు కాంతారావు ఆమెకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"అయ్యో చూసుకోలేదు. పోనీ పక్కకు తీసెయ్యండి" అంది మాధవి కంగారుతో కూడుకున్న భయం ఆమెకు తెలీకుండానే పదాల్లో కనిపించింది.

అంతా భోజనాలు చేసేశాక ఏకాంతంగా అక్కని చూసి అడిగింది మాలతి."ఏమే బావని చూసి లోకాన్నే మర్చిపోతున్నావేమిటి!" అని.

"చాల్లేవే నువ్వు మరీనూ" చెల్లెలి వేళాకోళానికి నవ్వొస్తున్నా కావాలని కోపం అభినయిస్తూ అంది.

"ఏమిటే మాలతీ! నువ్వు మరీ చిన్నపిల్లవైపోతున్నావ్" అంటూ కోప్పడింది వంటింట్లోంచి తల్లి మాణిక్యమ్మ.

"ఏం లేదమ్మా, అక్క ఈ రెండు రోజులబట్టీ మరీ మతిమరపు మనిషి అయిపోయిందంటున్నానంతే" అంది మాలతి.

"నీకు ఎలాగూ కొమ్ములు తిరిగాయి. ఆగు, మరో సంవత్సరం పోతే చెవులు మెలిపెట్టే మొగుడే దొరుకుతాడులే".

"మహా బావ నీ చెవులు మెలిపెడ్తున్నట్లు! నెత్తి కెక్కించుకుని పూజించకపోతే సరి... ఇదిగో, బాబు తయారయ్యాడుగా, ఇక నీ నెత్తికెక్కే కూర్చుంటాడు."

"మా రత్నబాబు అలాటి వాడెప్పటికీ కాడు".

మాధవి మాటలు మాలతికి వింతగా అనిపించాయి.

"అదేమిటి, రత్నబాబేమిటి!" అంది ఆశ్చర్యంగా.

"ఓ! అదా.... బాబు పేరులే" అనేసి వెళ్ళిపోయింది మాధవి.

కాంతారావు అంతా మంచంమీద పడుకుని విన్నాడు. మాధవి లోపలికి రావడంతోనే " ఆ పేరు ఎప్పుడు పెట్టావు మాధవీ?" అన్నాడు.

మాధవి మాట్లాడలేదు,.ఉయ్యాల్లో బాబు కదులుతూ వుంటే ఏదో జోలపాట పాడి ఊపుతూ, మధ్యలో పాట ఆపి "ఏవండీ ఆపేరు బాగోలేదా?" అంది.

కాంతారావు తలూపాడు "బాగానే వుంది".

"మరి మన బాబుకి ఆపేరే పెడ్తే".

"బాగానే వుంటుంది. కాని ఎందుకూ, కృష్ణమోహన్ అని ఆలోచించాలిగదూ" అన్నాడు. అలా అతను అంటుంటే ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరగడం కనిపించింది. కాంతారావుకు. దగ్గరగా వెళ్ళి "అదేమిటి మాధవీ పేరుగురించి యిలా పట్టుకు పోవాలా" అంటూ ఆమెను తన వైపుకు తిప్పుకుని "చూడు, తాతగారి పేరు కృష్ణశాస్త్రి గారని నీకు తెలుసుకదా. వచ్చేప్పుడు నాన్నగారు మరీమరీ చెప్పారు ఆపేరు పెట్టమని. ఆయన్ను కాదంటే ఎలా." తల నిమురుతూ అన్నాడు.

ఆమె అతని కౌగిట్లోంచి జారుకుని వెళ్ళిపోయింది. మళ్ళీ చీకటి పడేవరకూ ఆమె అతనికి కనిపించలేదు. దీపం వెలిగించడానికని గదిలోకి వచ్చి వెళ్ళిపోయింది. అప్పుడామె వాచిన కళ్ళూ, దువ్వుకోనట్టున్న చింపిరి జుట్టూ అతను చూశాడు. అనుకోకుండానే ఆమెను పిలిచాడు. మాధవి అతనివైపు చూడకుండానే వెళ్ళిపోయింది.

అలా మాధవి వెనక్కు తిరగకుండా, అతను చెప్పేదేమిటో వినకుండా వెళ్ళిపోతుంటే కాంతారావు ఎంతటి సరళహృదయుడైనా, బాహ్యంగా కాకపోయినా మనసులోనే కొంచెం బాధపడ్డాడు. కాస్సేపు ఆలోచించి ఆ రాత్రికి భోజనం చెయ్యకూడదనుకున్నాడు.

మాలతి పిలవడానికొచ్చి కాంతారావు రానంటే వెళ్ళిపోయింది.

మాధవి వచ్చి "భోజనం చెయ్యరా?" అంది ముభావంగా.

కాంతారావు మాట్లాడలేదు.

ఆమెకూ కాస్సేపు ఏమి మాట్లాడాలో తోచలేదు. మళ్ళీ "భోజనానికి రండీ" అంది. ఈసారి ఆమె మాటల్లో కోపం, నిర్లిప్తత లేదు. కాంతారావు ఓమారు ఆమె ముఖంలోకి చూసి మళ్ళీ పుస్తకంలోకి దృష్టి మరల్చుకున్నాడు.

వర్షాకాలపు తొలిరోజుల్లో గాలితాకిడికై ఎదురుచూసే నీలాకాశపు తెల్లని మేఘాలు ఆమె కళ్ళల్లో నల్లగుడ్డు చుట్టూరా ఆవరించాయి. చల్లగాలివీస్తే అవి మరి కొద్దిసేపట్లో కరిగి నీరై బొట్లుబొట్లుగా కారిపోయే స్థితిలో వున్నాయి.

'పిచ్చిపిల్ల! మాట్లాడితే కళ్ళల్లో కన్నీరు నిలుస్తుంది! మరీ విడ్డూరంగా గోరంతల్ని కొండంతలు చేసి ఊరికే బాధపడుతోంది, అనుకుంటూ పుస్తకం మడిచి ఆమె వెనకనే వెళ్ళాడు.

భోజనం చేస్తూ ఆమెను నవ్విద్దామని "ఈసారి పుట్టిన వాళ్ళందరకూ నువ్వే

పేర్లుపెట్టుకో. పేరుగురించి తర్జనభర్జనలు పడి ఆలోచించడం, తీరా ఆలోచించాక ఒకరు మూతిముడుచుకోవడం– యీ లేనిపోని గొడవంతా నా కెందుకూ. కనేదానివి నువ్వే గనక ఎంతమందికి ఎన్నిపేర్లు పెట్టాలనుకుంటావో యిటుపై నువ్వే నిర్ణయించుకో" అన్నాడు.

బలవంతాన నవ్వాపుకొని "చాల్లెద్దురూ, ఎవరైనా వింటే నవ్విపోగలరు" అందామె.

బారసాల కాగానే మరుసటిరోజు ఉదయం కాంతారావు వెళ్ళిపోయాడు. బారసాలనాడల్లా మాధవి అదోలా ఉండడం చూసి కాంతారావు అంతవరకూ చెప్పకుండా దాచిన బంగారపుకొత్తగొలుసు –బాబుకని చేయించినది– చిన్న పలకల ఎర్రపాడి వుంగరం, మరికొన్ని జుబ్బాలు ఆ మధ్యాహ్నం పెట్లోంచి తీసి మాధవి చేతుల్లో పెట్టాడు.

ఆమె మామూలుగా వాటిని అందుకుని భర్తకు అప్పటికి నవ్వు ముఖం చూపి వెళ్ళిపోయింది.

ఆమె నిజంగా సంతోషించలేదని ఆ తర్వాత అతనికి అర్థమైంది. బాబుపేరు గురించి ఆమెను కాదని తను మొండిపట్టు పడుతున్నట్టే అనిపించింది. అయినా పెద్దవాళ్ళ మాటని కొట్టివేయడం బావుండదు. మాధవి కూడా మొండిపట్టే పడుతోంది.

మొత్తంమీద బాబుకు కృష్ణమోహన్ అన్నపేరు పెట్టడం విని అతను యింకేమీ మాట్లాడలేదు. మరుసటిరోజు ఉదయం వెళ్ళిపోతూ "అమ్మకు మనవడ్ని చూసుకోవాలని వుంది. సాధ్యమైనంత తొందరగా వచ్చెయ్" అన్నాడు.

ఊరెళ్ళాక నెలరోజుల్లోనూ నాలుగైదు వుత్తరాలు రాశాడు. అన్నింటిలోనూ 'కృష్ణమోహనుడు ఏం చేస్తున్నాడు? వాడికి నా ముద్దులు' అంటూ చాలావరకు బాబుని గురించిన విషయాలే వుండేవి. ఆమె రాసిన జవాబుల్లోనూ వాడి సంగతులే. బాబు అల్లరి, పగలు నిద్రపోయి రాత్రిళ్ళు మేలుకొని సరిగా నిద్రపోనివ్వకపోవడం, పాలుపట్టడానికి ఓ క్షణం ఆలస్యమైతే యిల్లెగరగొట్టేయడం చాలా చాలా కబుర్లు రాస్తుండేది.

ఒక ఉత్తరంలో "నేను ఆదివారం మెయిలుకు వస్తున్నాను, స్టేషనుకు రండి" అని రాసింది.

కాంతారావు గంట ముందుగానే స్టేషనుకు వెళ్ళాడు. బండి వచ్చేవరకూ ఎదురుచూస్తూ ప్లాట్‌ఫారంమీదే పచార్లు చేస్తూవున్నాడు.

బండి వచ్చి ఆగింది. మాధవి కనిపించగానే వెళ్ళి పెట్టె అందుకుని, బాబుని తీసుకున్నాడు. ఆమె కిందకి దిగిరాగానే "మన కృష్ణుడు బండిలో గొడవ చెయ్యలేదు కదా?" అన్నాడు.

"ఉండే కొలదీ వట్టి పెంకివాడయిపోతున్నాడు. బండి ఎక్కింది లగాయితు ఒకటే ఏడుపు" అంది విసుగ్గా.

సామాను తీసుకుని స్టేషను బయటికి వచ్చి రిక్షాలో యింటికి వెళ్ళిపోయారు.

మనవడ్ని చూసి మురిసిపోయింది సుబ్బలక్ష్మమ్మ. "అచ్చంగా నీ పోలికేనే అమ్మా" అంది కోడలితో.

ఆ రాత్రి " ఏం పిల్లా! పేరుగురించి పట్టబట్టావట" అని కోడలిని అడిగింది అత్త.

"వట్టినేనండీ. పలకడానికి ఆ పేరు బాగోలేదని మరో పేరైదైనా పెట్టమన్నాను. వారు ఆ పేరే పెట్టాలంటే కాదంటానా" అంటూ కాంతారావు గదిలోంచి పిలుస్తే లోపలికి వెళ్ళింది.

"చూడు, నీ కృష్ణుడు ఏం చేశాడో, ఏడుస్తున్నాడు కదాని ఎత్తుకొంటే ఫేంటు, చొక్కా రెండింటిని తడిపి ముద్దచేశాడు" అన్నాడు కాంతారావు.

మాధవి ఫకాలున నవ్వి బాబుని తీసుకుంటూ అంది "పేరు పెట్టినవారు ఆ ఆమాత్రం అల్లరిచేస్తే భరించలేరా" అని.

బావుంది కృష్ణుడిపేరు పెట్టినంత మాత్రాన కొంటెవాడౌతాడనా నీ ఉద్దేశం? అయితే రత్నబాబని పేరెడ్తే రత్నాలు కురిపిస్తాడంటావ్." అంటూ దగ్గరకొచ్చి బుగ్గమీద మెల్లగా చిటికవేసి భోజనానికి వెళ్ళిపోయాడు.

భోజనం చేసి వచ్చి కూర్చున్న కాంతారావు అలికిడి విని కుర్రాడిని ఉయ్యాల్లో వేసి ఊపుతున్న మాధవి "మీరు చాలా మంచివారండీ" అంది.

ఆమె అంతవరకూ అలా ఏమిటాలోచిస్తూవుందో అతనికి అర్థంకాలేదు. అవే మాటలు అంతకుముందు ఒకసారి ఆమె నోటిమీదుగా వినిపించినట్టనిపించింది. అవి ఎప్పుడు ఎక్కడ ఎందుకందో జ్ఞాపకం లేకపోయినా వట్టినే ఏ కారణం లేకుండా అనలేదని, ఆ మాటల వెనుక భావగర్భితమైన విషయమేదో ఉండివుంటుందని అతను

అనుకున్నాడు.

అది తెలుసుకోవాలని అతను ప్రయత్నించలేదు. ఆమె మనసు అతనికి తెలుసు. ఆమె ఏ విషయమూ చెప్పకుండా దాచదని అతని నమ్మకం.

ఒకసారి ఆమె కుర్రాడిని గురించి పనిపిల్లని అడుగుతూ "రత్నబాబు లేచాడేమో చూసిరావే" అంది మాధవి.

అది కాంతరావు విన్నాడు. మళ్ళీ అతనిలో భావ సంచలనం చెలరేగింది.

అప్పుడప్పుడు వాడిన పువ్వులా మార్దవంలేని ఆమె నవ్వూ, పుంతదాపున షికారీని చూసి బెదిరిన లేడిలా చెదిరిన ఆమె చూపులూ, మనసులో విషయాన్ని దాచలేక వేరే రూపంలో బైటపెట్టే ఆమె దుర్బలత్వం అతని కళ్ళముందు నిలిచాయి.

ఆరాత్రి ఆమె అతని దగ్గరకు వచ్చినప్పుడు "నాకు చెప్పవా?" అన్నాడు, ఆమెను దగ్గరకు తీసుకుని చుబుకాన్ని, అధరాన్ని ముద్దెట్టుకుంటూ.

ఏమిటన్నట్టుగా అతని ముఖంలోకి ముఖంపెట్టి జ్యోతుల్లాటి కళ్ళని ఆర్పకుండా చూసింది ఆమె.

"నువ్వు బాబుని ఒక్కమారూ పేరెట్టి పిలవ్వేం? అప్పుడప్పుడు కొత్తపేర్లు చేర్చుతూ వుంటావెందుకు?" అన్నాడు.

అతని వెచ్చని కౌగిట్లో వున్నా శిశిర రుతువులో శీతగాలిలో గజగజలాడినట్టుగా వణికిపోయింది.

అతను సుతారంగా ఆమె ముంగురుల్ని సవరిస్తూ "ఏదో విషయం నా నుండి దాయాలనుకుంటున్నావు కదూ. నాకు చెప్పవా?" అన్నాడు మళ్ళీ.

ఆ సమయంలో ఆమె కళ్ళల్లో కన్నీరు నిలిచి జారిపోవడం అతనికి కనిపించకపోయినా వేడినిట్టూర్పులు చుట్టూరా ఆవరించి ఆమె ఏడుస్తున్నదనే విషయాన్ని తెలియజేసాయి.

కాంతారావు ఆమెను మురిపించాలని మరింత దగ్గరగా లాక్కుని వక్షానికి వక్షాన్ని, అధరానికి అధరాన్ని అదుముకున్నాడు.

రెండు కన్నీటి చుక్కలు అతని చెంపలమీద పడ్డాయి. అతను తుడుచుకుని "ఇంకా ఏడుపేనా... ఒద్దులే... నాకేమీ చెప్పొద్దు. ఊరుకోమరి" అన్నాడు లాలనగా. ఆమె చెంపలమీద తడిని తుడిచాడు. ఆమె చాలాసేపు ఏమీ మాట్లాడకుండా అలాగే

వుండిపోయింది. ఆ తర్వాత లేచి కూర్చుని "మీరు నన్ను క్షమిస్తారా" అంది.

"నా మనసు నీకు తెలీదా మాధవీ" అన్నాడు కాంతారావు ఆమె ముఖంలో ముఖంపెట్టి.

మాధవి అతని వక్షంమీదకు వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది. అతనికి ఏం చెయ్యాలో తోచక ఆమె శిరోజాల్ని వేళ్ళతో వెనక్కు దువ్వుతూ "పోనీ ఆ విషయం నాతో చెప్పొద్దులే" అన్నాడు.

ఆమె ఏడ్చి ఏడ్చి అతని గుండెలమీద నిద్రపోయింది. ఆమెను పక్కకు వత్తిగించి మరో మంచంమీదకు వెళ్ళిపోయాడు.

అతనికి ఎంతసేపటికీ నిద్రపట్టలేదు. లేచివెళ్ళి బెడ్‌లైట్ వేశాడు.

నుదుటిమీద చెదిరిపోయిన సింధూర తిలకం ముందుకు వాలిన తల వెంట్రుకలతో కలిసి గుండ్రని ముఖంలో వింతగా శోభించింది. ముఖంమీద అక్కడక్కడ పల్చగా పరుచుకున్న చెమటతడి, దీపం వెల్తురులో చెమ్కి రేణువుల్లా మెరుస్తోంది. ఆమె మంచం వరకూ వచ్చి చూస్తూ చాలాసేపు అలాగే నుంచున్నాడు.

నిద్రలో ఆమె ఏమిటో కలవరిస్తోంది.

'పిచ్చిపిల్ల... నిద్రలో కూడా యీ కలవరింపేనా' అనుకుంటూ నవ్వుకుని వెళ్ళి పడుకున్నాడు.

ఉదయం లేచేటప్పటికి మాధవి అతని ఎదురుగా నుంచొని "ఇంకా నిద్రేమిటండీ, అత్తయ్య ఊరికే కంగారు పడుతోంది, బస్సుకి టైం అయిపోతోందని, లేవండి" అంటోంది. అప్పుడతనికి జ్ఞాపకం వచ్చింది అమ్మ చెల్లెలు దగ్గరకు వెళ్తున్నట్టు.

లేచి గబగబా తెమిలి తల్లిని పదిగంటల బస్సుకి పంపించి, ఆరోజు గవర్నమెంటు సెలవు కావడంతో పన్నెండింటివరకూ మిత్రుల యిళ్ళకు వెళ్ళి గడిపి, భోజనం టయిముకు యింటిని చేరుకున్నాడు.

భోంచేసి యింటిపట్టునే వుండిపోయాడు ఏదో పుస్తకం చదువుకుంటూ. అతను చదువుకుంటుంటే మాటిమాటికీ మాధవి అతను చదువుకుంటున్న గదిలోకి ఏదో చెప్పాలని వచ్చి చెప్పకుండానే వెళ్ళిపోతుండేది. అతని దగ్గరకంటూ వచ్చి పక్కనే కూర్చుని, అంతలోనే ఏదో జ్ఞాపకం రాగానే లేచి వెళ్ళిపోయేది. భూగర్భంలో శిలలు కరిగి లావాలా బైటపడడానికై సుస్థిరమైన కొండల్ని కదిపి పైకి ఎగజిమ్మినట్టు ఆమె

మనసు లోలోపల బిగపెట్టిన విషయమేదో హృదయంలోంచి ఉబికిరావడానికై పెద్ద సంచలనాన్నే కలిగిస్తోంది. ఆ తాకిడికి ఆమె తట్టుకోలేక అతని ముందు ఒక్కసారిగా వెళ్ళగక్కుదామనుకొనేది. తీరా అది బైటపడితే సంభవించే పరిణామాన్ని తలంచుకుని గజగజలాడిపోతోంది.

చివరకు ఎలాగైతే ధైర్యంచేసి అతనిముందుకొచ్చి "మీకో విషయం చెప్పాలి" అంది.

అతను చదువుతున్న పుస్తకంలోంచే చెప్పమన్నట్టుగా ఆమెవైపు చూశాడు.

ఆమె కూడగట్టుకున్న అంత ధైర్యమూ అతని చూపుతో నీరుగారిపోయింది.

చీకటిలోంచి వెళ్తున్నవాడు పామునుచూసి తాడనుకొని పక్కనుంచి పోయినా అది ఏమీ చేయదని మనసులో అనుకుని,తీరా తాడునిచూసి పామనుకుని పరుగెత్తి పారిపోదామన్నట్టుందామె స్థితి.

"అబ్బే ఏంలేదు" అని వెళ్ళిపోయింది.

పుస్తకం మడిచి ఆమె వెనకే వెళ్ళాడు కాంతారావు. "ఏదో చెప్పాలని యిలా వచ్చేశావేం?" అన్నాడు.

ఆమె దీనంగా అతని కళ్ళల్లోకి చూసింది. "ఒక విషయం చెప్తాను, మీరు కోపగించుకోరుకదూ" అంది.

"పిచ్చిదానా ఎప్పుడయినా కోప్పడ్డానా?"

లేదన్నట్టు తలతిప్పింది. "మరి క్షమిస్తారు కదూ" అంది మళ్ళీ అతి దీనంగా ముఖంపెట్టి. జవాబుగా అతను ఆమెను మంచంమీద కూర్చోబెట్టి ఆమె పక్కనే తనూ కూర్చుని ఆమెచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

ఆమెకు ఎలా ప్రారంభించాలో తోచక రెండు నిమిషాలు మౌనంగా వుండిపోయి "నాకు కృష్ణమోహన్ పేరువింటే చిన్నప్పటి విషయాలు గుర్తుకొస్తాయి. అందుకని బాబుకి ఆ పేరు పెట్టడం ఎంతమాత్రం యిష్టంలేదు" అంది అకస్మాత్తుగా.

'ఆ చిన్నప్పటి విషయాలు ఏమిటి?' అని అతను అడగలేదు. ఆవిడే చెప్తుందిలే అన్నట్టుగా ఊరుకుండిపోయాడు.

"చిన్నప్పుడు చదువునే రోజుల్లో కృష్ణమోహన్ అనీ ఓ అబ్బాయి వుండేవాడు. అతను కూడా మా వీధిలోనే వుండడంవల్ల బాగా తెలుసు. అతను కాలేజీలో ఇంటర్

చదువుతుండేవాడు. బాగాపాటలుపాడేవాడు. మా వీధి చాలా సన్నని సందు కావడంవల్ల స్కూలుకి వెళ్తున్నప్పుడు ఆ యింటిముందునించి వెళ్తుంటే చాలాసార్లు అతను పాటలు పాడడం వినిపించేది. అందుకే గాబోలు అతనంటే యిష్టం ఏర్పడింది. నేనప్పుడు ఫిఫ్తుఫారం చదువుతున్నాను. అతనుంటున్న యింటికి ఎదురింట్లోనే నా క్లాసేచదివే సీతారత్నం వుండేది. ఆ అమ్మాయి యింటికి వెళ్ళినప్పుడల్లా అతను కిటికీలోంచి నన్ను చూస్తుండడం చాలాసార్లు గమనించాను.

ఒకసారి స్కూలునించి ఒక్కర్తినీ వస్తున్నాను. ఆరోజు సీతారత్నం స్కూలుకి రాలేదు. ఇంటికి మరీదూరం కాదుగనక నడిచే వస్తున్నాను. దారిలో అతను ఎదురై నన్ను ప్రేమిస్తున్నట్టూ, ఆవిషయం చెప్పాలని ఎంతో కాలంనించి ఎదురుచూస్తున్నట్టూ చెప్పాడు. అతని మాటలకు నాకు సంతోషం కలిగినా ఎందుకో భయంవేసి గబగబా వచ్చేశాను. ఆ తర్వాత మూడు నాలుగుసార్లు రోడ్డుమీద కలిసి పలకరించి మాట్లాడినపుడు భయపడి వచ్చేయలేదు. అతని పాటల గురించి మెచ్చుకుంటూ మాట్లాడేదాన్ని. నాతోపాటు కొంతదూరం నడుస్తూవచ్చి ఆగిపోతుండేవాడు. అలా నాలుగైదు నెలలు గడిచాయి.

మేమిద్దరం అలాకలిసి కబుర్లు చెప్పుకుంటూ రావడం ఎవరు చెప్పారో నాన్నగారికి తెలిసింది. ఓ సాయంకాలం వాళ్ళింటివాళ్ళతో పెద్ద కొట్లాట పెట్టుకుని వచ్చారు నాన్నగారు. నన్ను కొట్టలేదుగాని మళ్ళీ అతనితో మాట్లాడితే స్కూలు మానిపించి యింట్లో కూర్చోబెడ్తానని గట్టిగా కోప్పడ్డారు. అప్పట్నించీ అతను ఎప్పుడైనా ఎదురుపడినా, మాట్లాడ్డానికి ప్రయత్నించినా తప్పించుకుని వచ్చేసేదాన్ని. దార్లో కాపుకాస్తున్నట్టు నాన్నగారికి తెలిసిందో ఏమో నాకూ, సీతారత్నానికీ స్కూలుకి తీసుకెళ్ళి తీసుకురావడానికి ఓ రిక్షాని కూడా ఏర్పాటుచేశారు. అయినా అతను నా కోసం ఎదురుచూడ్డం మానలేదు.

ఒకరోజు అకస్మాత్తుగా కృష్ణమోహన్ వచ్చి నేను యింట్లో వున్నానేమోనని అడిగాడట. నాన్నగారు ముఖం వాచేట్లు చీవాట్లు పెట్టి పొమ్మని గెంటేశారట. మా పెదనాన్న కొడుకు తన ఫ్రెండ్స్‌తో వెళ్ళి అతన్ని ఓరోజు సాయంత్రం కాలేజీ గ్రౌండ్స్‌లో చిదగతన్నినట్టు కూడా తెలిసింది. ఆ ఏడాది అతను పరిక్ష తప్పాడని విన్నాను. ఒక ఏడాదిలో అతనిలో చాలా మార్పు వచ్చింది. చాలా డల్‌గా అయిపోయాడు. వీధిలో యిల్లుకూడా ఖాళీ చేసి వూళ్ళో మరెక్కడికో వెళ్ళిపోయారు వాళ్ళు. ఆ తర్వాత అయిదారు నెలలకు గాబోలు బజార్లో కనిపించాడు. మాసిపోయిన గెడ్డం, దుమ్మూ, ధూళితో చిరిగిపోయిన బట్టలు, పీడముఖం- అతని రూపం మారిపోయింది. ఆ తర్వాత ఏడాదికే

పిచ్చి మరీ ముదిరి వాళ్ళు ఆ వూరుకూడా విడిచిపెట్టి వెళ్ళిపోయారని తెలిసింది. ఎప్పుడు గుర్తొచ్చినా నా వల్ల ఓ మనిషి పిచ్చివాడైపోయాడని మనసంతా వికలమైపోతుంటుంది. అందుకే నాకు ఆ పేరు తలచుకోడానికి కూడా భయంవేస్తుంది''.

మాధవి రెండు చేతుల్తోనూ ముఖం కప్పుకొని అతని ఒడిలోకి వాలిపోయింది.

కాంతారావు చాలాసేపటివరకు ఆమెను కదల్చలేదు. నిశ్చలంగా కూర్చుని కిటికీలోంచి బైటికి చూస్తున్నాడు. మబ్బు విడిచిన సూర్యుడి ఎండ వాలుగా కిటికీలోంచి గదిలోకి పడుతోంది.

మాధవి అతని వడిలోంచి లేచి భయంభయంగా అతని ముఖంలోకి చూసింది.

కాంతారావు చిరునవ్వు నవ్వాడు. ''ఇందుకేనా యింతకాలంనించీ బాధ పడుతున్నావ్! భలేదానివే! చిన్నతనంలో తెలీని యీడులో జరిగిన అతి సాధారణమైన విషయాన్ని గోరంతల్ని కొండంతలుగా చేసుకొని యింతగా బాధపడతా వేమిటి? ఒకనాడు తెలీక చేసిన పని జీవితాంతం విచారించడానికి కారణం కాకూడదు. నడిచిపోతున్నప్పుడు కాలికింద చీమలు నలిగి చస్తున్నాయని బాధపడవు. అంతే! నీకు తెలీకుండా జరిగినదానికి నువ్వు బాధ్యురాలువుకావు. ఇంత చిన్న విషయానికే నువ్వు లోలోపల కుమిలిపోవడం నాకు ఆశ్చర్యంగావుంది. ఏమీలేనిదాన్ని ఏదోగా ఊహించుకుని నీలో నువ్వే కుమిలి పోతుంటే అర్థంకాక,మనిద్దరిమధ్యా మనస్పర్థల కార్చిచ్చు ఎలా రగుల్కొందో చూశావా. కార్చిచ్చు అంటుకుంటే చెట్టొక్కటే కాదు అచుట్టపట్ల వున్నవన్నీ నాశనమవుతాయి... ముందే దానిని ఆర్పేయాలి. పేరుచూసి భయపడిపోవడానికి కారణం నీలో తప్పుచేసానన్న భావం బలంగా నాటుకుపోయింది. ఆ భావాన్ని తొలగించుకుంటే తప్ప నీ మనసుకు ప్రశాంతత వుండదు. నువ్వు చేసిన పనిలో ఏ తప్పూ నాకు కనిపించలేదు. నీకెందుకంత ఆందోళన! ఇంకా ఆ భయం దేనికి! ఇలా దగ్గరకు వచ్చి కిటికీలోంచి అవతలికి చూడు'' అంటూ ఆమెను దగ్గరకు తీసుకుని ఆకులమధ్య ముక్కుల్ని పొడుచుకుంటున్న రెండు పిట్టల్ని చూపించి, పరధ్యాన్నంగా ఆమె చూస్తుంటే చటుక్కున ఆమె బుగ్గమీద ముద్దెట్టుకున్నాడు.